జోరందుకున్న వరి కోతలు

- హార్వెస్టర్లకు పెరుగుతున్న డిమాండ్
- అకాల వర్షాలతో కొంత ఆలస్యం
- జాగ్రత్తలు పాటించి మద్దతు ధర పొందాలంటున్న వ్యవసాయాధికారులు



పొట్టపెల్లిలో వరి కోస్తున్న హార్వెస్టర్

లక్ష్మణచాంద/నర్సాపూర్(జి): జిల్లాలోని వివిధ గ్రామాల్లో వరి కోతలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. దీంతో పొలం కోసే యంత్రాల(హార్వెస్టర్లు)కు డిమాండ్ పెరుగుతోంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావడంతో రైతులు తమ పంటను ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తూ విక్రయించుకుంటున్నారు.

అకాల వర్షాలతో ఆలస్యం..

ఇటీవల కురిసిన వడగండ్ల వానలు రైతులను నట్టేట ముంచాయి. కోత దశకు వచ్చిన పంటలను వర్షాలు తీవ్రంగా దెబ్బతీశాయి. మరోవైపు పొలంలో నీరు నిలువడంతో హార్వెస్టర్లు దిగబడ్డాయి. దీంతో రైతులు పంట కోసేందుకు ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా మారడంతో తిరిగి కోతలు ప్రారంభించారు.

లక్ష్మణచాంద మండలంలో 10,573 ఎకరాల్లో సాగు..

లక్ష్మణచాంద మండలంలోని 17 పంచాయతీల పరిధిలో 23 గ్రామాల్లో మొత్తం 10,573 ఎకరాల్లో వరిసాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ప్రస్తుతం వరికోతలు ప్రారంభం కాగా.. ఇప్పటివరకు మండలంలో 20 నుంచి 30 శాతం వరకు వరి కోతలు పూర్తయినట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.

- మామడ మండలంలో ఇప్పుడిప్పుడే వరి కోతలు ప్రారంభమయ్యాయి. అన్ని గ్రామాల్లో వరినాట్లు కొంత ఆలస్యం కావడంతో కోతలు ఇప్పుడే ప్రారంభమయ్యాయి. వారం రోజుల తర్వాత కోతలు జోరందుకునే అవకాశం ఉంది.
- సోన్ మండలంలోని పలు గ్రామాలలో వరికోతలు ప్రారంభమయ్యాయి. మరో వారం రోజుల్లో కోతలు జోరందుకోనున్నాయి.
- నిర్మల్‌రూరల్ మండలంలో ఒకటి, రెండు గ్రామాల్లోనే వరికోతలు ప్రారంభమయ్యాయి. మరికొద్ది రోజుల్లో అన్ని గ్రామాల్లో వరికోతలు ప్రారంభం కానున్నాయి.
- నర్సాపూర్(జి) మండల వ్యాప్తంగా 5,350 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా 1,17,700 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఆ మేరకు ధాన్యం సేకరించేందుకు ఐకేపీ, డీసీఎంఎస్, పీఏసీఎస్‌ల ద్వారా మండలంలో 11 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

చాలా మంది రైతులు వరి పంట కోసిన తర్వాత నూర్పిడి చేసి ఆరబోయకుండా, కేంద్రాలకు తీసుకురావడంతో మద్దతు ధర పొందలేక నష్టపోతున్నారు. అయితే ధాన్యానికి మద్దతు ధర లభించాలంటే తప్పనిసరిగా పలు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

రైతులు పాటించాల్సిన జాగ్రత్తలివే..



- వరి గింజలు బంగారు రంగులోకి వచ్చాక కోతలు ప్రారంభించాలి.
- పంట కోతకు ముందు పొలంలో ఉన్న కల్తీ మొక్కలను తీసివేయాలి.
- కోతకు 15 రోజుల ముందే నీటి తడులు ఆపివేయాలి.
- 1010 రకం వరి మాత్రం గోధుమరంగులోకి రాగానే కోయాలి. లేదంటే బంగారు రంగు వచ్చే వరకు చూస్తే గింజ రాలిపోతుంది.
- వేర్వేరు రకాలు సాగు చేస్తే వేరు వేరు కల్లాలు ఏర్పాటు చేయాలి.
- వరి గింజలని సిమెంట్ కల్లాలపై లేదా టార్పాలిన్లపై ఆరబెట్టి బాగా ఎండేలా రెండు, మూడు రోజులు కలియబెట్టాలి.
- పంట కోశాక సరిగా ఆరబెట్టకపోతే గింజలు రంగు మారి నాణ్యత తగ్గే అవకాశం ఉంది.
- ధాన్యం ఆరబెట్టే సమయంలో చెత్త, వ్యర్థాలు చేరకుండా జాగ్రత్తపడాలి.
- గ్రేడును బట్టి ధర ఉంటుంది. ధాన్యం 'ఏ' గ్రేడ్ రకానికి ప్రభుత్వం మద్దతు ధర రూ.2060, సాధారణ రకానికి రూ.2040గా నిర్ణయించింది.

కోత పూర్తయింది



యాసంగిలో నాకున్న మూడు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. నాలుగు రోజుల కిందటే పొలం కోత పూర్తి చేశా. ఈసారి అకాల వర్షాలతో కొంత ఆలస్యమైంది. కొనుగోలు కేంద్రానికి తరలించా. నిబంధనల ప్రకారం తేమశాతం రాగానే పంటను విక్రయిస్తాం. **– నర్సయ్య, పొట్టపెల్లి, మం.లక్ష్మణచాంద**

ఇంకా కోయాల్సి ఉంది



నాలుగెకరాల్లో వరి పంట సాగు చేశా. ఇప్పటివరకు రెండెకరాల్లో కోత పూర్తయింది. అకాల వర్షాల కారణంగా భూమి తడి ఉండటంతో మిగతా రెండు ఎకరాల్లో కోత ఆలస్యమవుతోంది. మరో మూడు రోజుల్లో వరికోత పూర్తవుతుంది.

– అరుణ్, రాచాపూర్,మం.లక్ష్మణచాంద

పదిరోజుల్లో పూర్తయ్యే అవకాశం

ఈ యాసంగిలో లక్ష్మణచాంద మండలంలో మొత్తం 10,573 ఎకరాల్లో వరిసాగు చేశారు. ఇప్పటికే 30 శాతం వరకు కోతలు పూర్తయ్యాయి. ఈసారి అకాల వర్షాలతో కోతలు ఆలస్యమయ్యాయి. మరో 10 రోజుల్లో వరికోతలు పూర్తయ్యే అవకాశం ఉంది. **– ప్రవీణ్‌కుమార్, లక్ష్మణచాంద ఏవో**

ధాన్యం ఆరబెట్టి తేవాలి

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే ముందు తప్పనిసరిగా పొలాల్లో ఆరబెట్టాలి. తాలు ఒక శాతం, తేమ 17 శాతానికి మించొద్దు. మట్టిపెల్లలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలా అయితే మద్దతు ధర రూ.2060 వచ్చే అవకాశం ఉంటుంది. హార్వెస్టర్‌తో పంట కోసే సమయంలో అందులోని ఫ్యాన్ ఆన్ చేసేలా రైతులు చూసుకోవాలి.

– జాదవ్ సాయికిరణ్, నర్సాపూర్(జి) ఏవో

నేడు చెక్కులు పంపిణీ

లోకేశ్వరం: మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం ఉదయం 11 గంటలకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పంపిణీ చేస్తామని తహసీల్దార్ సరిత ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ గ్రామాల లబ్ధిదారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని వారు కోరారు.

నేడు సీఎం కప్ క్రీడా పోటీలు

తానూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం సీఎంకప్ మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు ఉంటాయని..యువకులు హాజరు కావాలని కోరారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

కుంటాలలో..

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం నుంచి ఈనెల 17వరకు సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభిస్తామని.. క్రీడాకారులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

సారంగపూర్‌లో..

సారంగపూర్: మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో సోమవారం ఉదయం 9:30 గంటలకు తెలంగాణ సీఎంకప్ క్రీడా పోటీలను ప్రారంభించనున్నట్లు ఎంపీపీ మహిపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

నూతన కార్యవర్గం

సోన్: మండలంలోని బొప్పారం గ్రామంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ కమిటీ సమావేశమై గ్రామ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గ్రామ గౌరవ అధ్యక్షుడిగా సి.రాజేందర్, అధ్యక్షుడిగా వి.స్వామి, ఉపాధ్యక్షులుగా వి.పరమేశ్వర్, ఒ.గంగాధర్, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.ప్రసాద్, శ్రీపాదం రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి.లక్ష్మణ్, కోశాధికారిగా వి.శ్యాంసుందర్, సంయుక్త కార్యదర్శులుగా ఓ.శ్రీనివాస్, ఎస్.వంశీవర్ధన్, కార్యవర్గ సభ్యులుగా ఎస్.గంగాధర్ చారి, ఓ.మనోహర్‌ను ఎన్నుకున్నారు.

క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



విరాళం అందిస్తున్న పూర్ణచందర్‌నాయక్

కడెం: మండలంలోని పాండ్వపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పంచముఖ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. బీఆర్ఎస్ నాయకుడు బాదవత్ పూర్ణచందర్‌నాయక్ రూ.5,116, పీసీసీ సభ్యురాలు, ఉట్నూర్ జె డ్పీటీసీ రాథోడ్ చారులత రూ.5వేలు ఆలయానికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో సన్మానించారు.

తల్లిని మించిన దైవం లేదు



వేడుకల్లో పాల్గొన్న ఏపీపీ అరుణ

ఖానాపూర్: తల్లిని మించిన దైవం లేదని.. ప్రతీ మహిళ రేపటి మాతృమూర్తేనని బైంసా ఏపీపీ తునికి అరుణ అన్నారు. ఆమె స్వగ్రామమైన మండలంలోని మస్కాపూర్ గ్రామంలో ఆదివారం కుటుంబసభ్యులతో కలిసి మాతృదినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుంచి బిడ్డని ప్రేమించడం, సంరక్షణ బాధ్యత స్వీకరించడం అమ్మతనాన్ని పెంపొందిస్తాయన్నారు. రవీందర్, రాజేందర్ తదితరులున్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న జనార్దన్

ఖానాపూర్: పట్టణంలోని వారసంతకు వెళ్లే మార్గంలో ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఆదివారం బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు భుక్య జాన్సన్‌నాయక్ యువసేన ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని సంఘ సేవకులు పల్లికొండ జనార్దన్ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు మజర్‌ఖాన్, అజహర్, ఫసి, సఫి, కరిపె రాజశేఖర్, పాల సంతోశ్, సాబిర్‌పాషా, తుప్ప నరేందర్, బుచ్చాగౌడ్, రమేశ్, రాకేశ్, నాగేశ్, రాజు, స్టిఫెన్, శ్రీనివాస్, లక్ష్మణ్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

అసోం సీఎంను కలిసిన జెడ్పీటీసీ



బిశ్వశర్మతో జెడ్పీటీసీ జానుబాయి

ఖానాపూర్: కరీంనగర్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆధ్వర్యంలో హిందూ ఏక్తాయాత్ర నిర్వహించారు. ఇందులో పాల్గొనేందుకు వచ్చిన అసోం సీఎం హిమంత బిశ్వశర్మను పెంబి జెడ్పీటీసీ జానుబాయి మర్యాద పూర్వకంగా కలిశారు. అంతకుముందు నియోజకవర్గ పార్టీ నేతలతో కలిసి జెడ్పీటీసీ ఏక్తాయాత్రలో పాల్గొన్నారు.

26వ రోజుకు వీవోఏల సమ్మె

ఖానాపూర్: నియోజకవర్గ కేంద్రమైన పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు వీవోఏలు చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్షలు 26వ రోజుకు చేరాయి. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల వీవోఏలు దీక్షలో పాల్గొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు కనీసం వేతనం నెలకు రూ.26 వేలతో పాటు క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేశారు.

హిందూ ఏక్తాయాత్రకు నాయకులు



వాహనం వద్ద నాయకులు

మామడ: కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన హిందూ ఏక్తాయాత్రలో పాల్గొనేందుకు మండలంలోని పలువురు బీజేపీ నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. హిందువులంతా ఏకతాటిపై ఉండేందుకు ఈ యాత్ర చేపట్టినట్లు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ కొరిపెల్లి లింగారెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి చిన్నలింగారెడ్డి, పడాల శ్రీనివాస్, లింగంయాదవ్, రాజేశ్వర్, రాములు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



చించాలలో కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు



కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీపీ గజ్జారాంయాదవ్

ముధోల్: మండలంలోని చించాలలో ఆదివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీటీసీ బండారి గంగాధర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, నిర్వాహకులు నర్సారెడ్డి, కుమ్మరి శివాజీ, సందీప్, నారాయణ, కుమ్మరి గంగాధర్, రాజేశ్వర్, హన్మాండ్లు, రాజు, రాజేశ్వర్, మరిబా తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని అందకూర్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ అప్క గజ్జారాంయాదవ్ ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఆయన పేర్కొన్నారు. డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, సర్పంచ్ దాసరి కిషన్, ఎంపీటీసీ మధుకర్, నిర్వాహకులు చంద్రకాంత్, చంద్యాల మురళి, సాగర్‌రావు, పోతన్న, భోజన్న, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని డొంగుర్గాం, బూరుగుపల్లి(కే), చాక్‌పల్లి, రాంపూర్ గ్రామాల్లో ఆదివారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను జెడ్పీటీసీ చిన్నరామయ్య ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో రాంపూర్ సర్పంచ్ గోవిందరెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్, నిర్వాహకులు సంతోష్ పటేల్, ప్రవీణ్ పటేల్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందిస్తున్న సర్పంచ్ ప్రదీప్‌కుమార్

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన పున్నవేని లక్ష్మికి రూ. లక్షా 25వేలు, కోరుట్ల రేణుకకు రూ.45 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం సర్పంచ్‌ల సంఘం మండల కన్వీనర్ ముజ్జి ప్రదీప్‌కుమార్.. లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గైనీ సాయినాథ్, బీఆర్ఎస్ నాయకులు గజ్జారాం శ్రీనివాస్, శివ, మురళి తదితరులు పాల్గొన్నారు.

పుస్పూర్‌లో..

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన భోజన్నకు రూ.2400, గీతాంజలికి రూ.1700, లావణ్యకు రూ.8వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం గ్రామ పంచాయతీ ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు బాధితులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బండి ప్రశాంత్, సాయారెడ్డి, మోహన్‌రెడ్డి, రమేశ్, సుధాకర్, లక్ష్మణ్‌పటేల్, సాయిలు, శివన్న, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలేవి?

- ఇబ్బంది పడుతున్న ఉపాధి కూలీలు
- పట్టించుకోని అధికారులు
- మండలంలో ఐదు గ్రామపంచాయతీల్లో ప్రారంభం కాని పనులు



కుభీర్‌లో పని ప్రదేశం వద్ద ఉపాధి కూలీలు, సిబ్బంది

కుభీర్: నిరుపేదలకు వరంగా మారిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం లక్ష్యం నీరుగారుతోంది. కుభీర్ మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పని ప్రదేశాల వద్ద కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. మరో వైపు పలు గ్రామాల్లో అడిగిన వారందరికీ పని కల్పించడం లేదు. కొన్ని గ్రామాల్లోనైతే ఉపాధి పనులే ప్రారంభించలేదు. పనులు ప్రారంభించిన చోట కూలీలు పనులు చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు. నిబంధనల ప్రకారం అధికారులు పని ప్రదేశంలో టెంట్, తాగునీరు, దెబ్బ తగిలినప్పుడు ప్రథమ చికిత్స కోసం మందులు కల్గిన బాక్స్‌ను అందుబాటులో ఉంచాలి.

ఐదు పంచాయతీల్లో ప్రారంభం కాని ఉపాధి పనులు..

కుభీర్ మండలంలో 41 గ్రామపంచాయతీలు ఉండగా ఇప్పటికీ ఐదు గ్రామపంచాయతీలైన హల్దా, కిషన్‌నాయక్ తండా, దావుజీనాయక్ తండా, రాంనాయక్ తండా, ఫకీర్‌నాయక్ తండా గ్రామాల్లో పనులు ప్రారంభం కాలేదు. గత వారం గొడ్సర, పాంగ్ర, సాగ్వి, మాలేగాం గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయి. అక్కడ కూడా తక్కువ మంది పనులకు వెళ్తున్నారు. మాలేగాంలో 12 మంది మాత్రమే పనులకు వెళ్తున్నారు. మరో 20 రోజులైతే వర్షాకాలం వస్తుంది. ఇంకెప్పుడు పనులు కల్పిస్తారని కూలీలు.. అధికారులను ప్రశ్నిస్తున్నారు. కుభీర్‌లో 900 మంది కూలీలు ఉండగా కేవలం 250 మంది మాత్రమే పనికి వెళ్తున్నారు. అధికారులు మమ్మల్ని పనులకు పిలవడం లేదని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొదట్లో వద్దని..ఇప్పుడు పనులు

నిబంధనల ప్రకారం చెరువుల్లో పనులు చేయవద్దని అధికారులు ఆదేశాలిచ్చారు. కానీ తర్వాత పని ప్రదేశాలు దొరకక పోవడంతో చెరువుల్లో పనులు చేయవచ్చని జిల్లా అధికారులు అనుమతులు జారీ చేశారు. ప్రస్తుతం చెరువులు, గుట్టల సమీపంలోనే పనులు జరుగుతున్నాయి.

తక్కువ మందికే పనులు..

మండలంలో 15వేల జాబ్‌కార్డులు కలిగిన కూలీలు ఉండగా అందులో పనులకు వెళ్లేవారు 12వేల మంది వరకు ఉన్నారు. ప్రస్తుతం కేవలం ఆరు వేల మంది మాత్రమే పనులకు వెళ్తున్నారు. రోజు కూలీ అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం తవ్వితే రూ.272 ఇవ్వాలి. అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం తవ్వినా.. కాని మాకు రోజుకు రూ.120 కంటే ఎక్కువ రావడం లేదని కూలీలు వాపోతున్నారు. మరోవైపు అధికారులు మాత్రం ఇచ్చిన కొలతల ప్రకారం తవ్వకపోవడంతోనే కూలీలకు తక్కువ డబ్బులు వస్తున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు అందరికీ పని కల్పించి నిబంధనల ప్రకారం కూలీ డబ్బులు పడేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు ఇబ్బంది కాకుండా తాగునీరు, టెంట్ వంటి సౌకర్యాలు కల్పించాలి. ఈ ఏడాది దివ్యాంగులైన కూలీలకు పనులు కల్పించడం లేదు. వారి గ్రూపులను ఏర్పాటు చేసి పనులు కల్పించాలి. అధికారులు సూచించిన మేర తవ్వినా కూలీ తక్కువ వస్తుంది.

– గంగాశేఖర్, కుభీర్

అందరికీ పని కల్పించాలి



నిబంధనల ప్రకారం కూలీలకు పనులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. మా గ్రామంలో ఉపాధి పనులు జరగడం లేదు. అధికారులు కావాలనే మా గ్రామం పట్ల చిన్న చూపు చూస్తున్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి పని కల్పించాలి.

–జాదవ్ పండిత్, ఫకీర్‌నాయక్ తండా

సౌకర్యాల బాధ్యత పంచాయతీలదే..

కూలీలకు సౌకర్యాల బాధ్యత ఆయా గ్రామపంచాయతీల బాధ్యతే. వారికే డబ్బులు వస్తాయి. నీటి వసతి కోసం రోజుకు రూ.5 కూలీల అకౌంట్లలో జమ చేస్తున్నాం. ఇప్పటికీ చేన్లలో పంటలు ఉండటం పనుల కోసం కూలీలు ముందుకు రావడం లేదు. దీంతో పనులకు తక్కువ మంది వస్తున్నారు. **– హరిలాల్,కుభీర్ ఏపీవో**

అటెన్షన్ ప్లీజ్..

ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేయండి



లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామంలోని ఓ కాలనీలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ అందే అంత ఎత్తులో ఉండడంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని ట్రాన్స్‌ఫార్మర్ సరిచేయాలని వారు కోరుతున్నారు.

- ప్రశ్నించాల్సిన అధికారి: శివకుమార్, విద్యుత్ ఏఈ, లోకేశ్వరం, సెల్: 94408 11710

వైద్యశిబిరానికి స్పందన



తానూరులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

తానూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం భైంసా ఆరాధన ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు వచ్చి వైద్య పరీక్షలు చేసుకున్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు రాజారెడ్డి మాట్లాడుతూ భైంసా మండలం మాత్రి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ఆయుర్వేద ఆస్పత్రిలో తక్కువ ధరలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తాడేవార్ విఠల్, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, నాయకులు పోతారెడ్డి, మాధవ్‌రావ్‌పటేల్, వైద్యులు శ్రావణ్‌రెడ్డి, బిశ్వాస్, రూపేశ్, హత్వార్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: రోగాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని లోకేశ్వరం ఆదిత్య రాజన్న ఆస్పత్రి వైద్యులు సందీప్ అన్నారు. ఆదివారం మండలంలోని రాజూర గ్రామంలో లోకేశ్వరం ఆదిత్య రాజన్న ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 300 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్తగౌడ్, వీడీసీ చైర్మన్ నర్సారెడ్డి, బీజేవైఎం మండలాధ్యక్షుడు అనిల్, గంగాధర్, శ్రావణ్, సుజన్, సతీశ్ పాల్గొన్నారు.

భగవాన్ ఆలయం పరిశీలన

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ పట్టణంలోని 14వ వార్డు సోఫీనగర్‌లో నిర్మిస్తున్న శ్రీ విశ్వకర్మ భగవాన్ ఆలయాన్ని ఆదివారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పరిశీలించారు. ఈనెల 22న ఆలయ ప్రారంభోత్సవం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. విశ్వకర్మ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు గాంధారి ప్రభాకర్, సజ్జనపు మధుసూదనచారి, రవిబాబు, రవి, రామోజీ నారాయణ, పాండురంగ చారి, బ్రహ్మయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.